https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

గురువారం

05, మార్చి,32026

సంపుటి : 10

సంచిక : 128

పేజీలు : 8.00

వెల : 5.00

# సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

- త్వరలోనే స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా
- ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష



హైదరాబాద్,తరంగాలు

సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుం టుందని ఆయన తెలిపారు.

స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివా సరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

# అన్ని ప్రాంతాల్లో మక్కల కొనుగోళ్లు

**పంటలు పండించినా కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన**

**మాజీమంత్రి హరీష్ రావు**



సిద్దిపేట,మార్చి4: తరంగాలు తెలంగాణలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రైతన్నలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు కాంగ్రెస్ పాలనలో కష్టాలు తప్పడం లేదని అన్నారు. షాపుల్లో ఇవ్వాల్సిన యూరియా యాపుల్లో ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ సర్కార్ విఫలమయ్యిందని అన్నారు. కోతల దశకు వచ్చినా పంట పెట్టుబడి సాయం ఇవ్వలేని దుస్థితికి చేరిందని పేర్కొన్నారు. కనీసం పండించిన పంటైనా అమ్ముకుందా మంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ అదే నిర్లక్ష్యం, వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతుందని వెల్లడించారు.


# ఇరాన్ నేతగా ఖమేనీ కుమారుడు ముజ్తబా?

**అధికార మార్పిడి జరిగిందని ప్రచారం**

**అధికారికంగా వెల్లడించడమే తరువాయి**



# హర్ముజ్ జలసంధిలో సడలింపులు



టెహ్రాన్,తరంగాలు ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

# రెవెన్యూ శాఖలో 32వేల పెండింగ్ కేసులు

**కేసుల పర్యవేక్షనకు లీగల్ సెల్ ఏర్పాటు**

**అసెంబ్లీలో మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి**



అమరావతి,మార్చి4తరంగాలు : రెవెన్యూ శాఖలో మొత్తం 32 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పెండింగ్ కేసుల పర్యవేక్షణ కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు.

ఏపీశాసనసభలోప్రశ్నోత్తరాలు సందర్భంగా రెవెన్యూ శాఖలో కోర్టు కేసులపై యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రశ్న లేవనెత్తారు. రెవెన్యూ శాఖలో భారీగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. కబ్జాదారులు రెచ్చిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరముందని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

# 6 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ

- అంతర్జాతీయ మహిళ దినోత్సవం కానుక
- ఈ నెల 8 నుంచి స్క్రీనింగ్ ప్రారంభం
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై మంత్రి
- దామోదర్ రాజనర్సింహ సమీక్ష




హైదరాబాద్,మార్చి4తరంగాలు

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని సూచించారు.

అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు.

# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి



# ఐదోరోజూ పరస్పర దాడులు

- ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు
- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం
- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి



సంపాదకీయం

# ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా ?

వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ఫ్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్గానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్‌తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి. దేశీయంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. దేశీయ వస్తువులను వాడాలనడం కాదు..దేశీయ ఆహారాలనే వాడలనే నినాదం రావాలి. ఈ యుద్ధంతో అయినా పాలకుల ఆలోచనా తీరు మారాలి. లేకుంటే సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం.

అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. కారణం అవి సరిగా లేకపోవడం లేదా, అమలులో లోపాలు ఉండడమే కారణంగా చూడాలి. ప్రపంచ యుద్దాలతో మనం మారాలి. స్వయం సమృద్ధి దిశగా నడవాలి. సంక్షోభాలను ఎదుర్కొనేలా నిలబడగాలి.

# ఇరాన్ నేతగా ఖమేనీ కుమారుడు ముజ్తబా?

టెహ్రాన్,మార్చి4 అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ మరణించడంతో ఇరాన్ తదుపరి నాయకత్వంపై సందిగ్ధం నెలకొంది. ఎవరు పగ్గాలు అందుకుం టారన్న చర్చలో ఖమేనీ కుమారుడే ముందువరసలో ఉన్నట్లు సమాచరం. ఇప్పుడా పాలనా పగ్గాలను ఖమేనీ కుమారుడు ముజ్తబా హాళస్సేనీ ఖమేనీకి అప్పగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ లేని ముజ్తబా.. త్వరలోనే సుప్రీంలీడర్ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఆయతుల్లా అలీ ఖమేనీ రెండో కుమారుడే ముజ్తబా. 1969లో ఇరాన్‌లోని మషాద్‌లో జన్మించారు. ముజ్తబా పదేళ్ల వయసులోనే ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లవీకి వ్యతిరేకంగా 1979లో ఇస్లామిక్ విప్లవం జరిగింది. ఆ సమయంలో ఖమేనీ కుటుంబం రాజకీయంగా ఎదిగింది. ఆ తర్వాత వీరి కుటుంబం టెహ్రాన్‌లో స్థిరపడింది. కోమ్‌లోని సెమినరీస్‌లో మత విద్యను అభ్యసించిన ముజ్తబా ÷-లకెరికల్ ర్యాంక్‌కు చేరుకున్నారు. కానీ, అత్యున్నత ర్యాంక్ అయిన ఆయతుల్లాను అందుకోలేకపోయారు. అయినా సుప్రీంలీడర్ కార్యాలయంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా మారారు. 1980ల్లో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో ముజ్తబా పాల్గొన్నాడు. ఆ అనుభవమే ఇరాన్ సైన్యానికి ఆయనను దగ్గర చేసింది.



ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)తో ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. ముజ్తబాకు సుప్రీం పదవి దక్కడానికి ఇదీ ఓ కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబు తుంటారు. సాధారణంగా సుప్రీంలీడర్ నియామ కాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మత పెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. ఇందులో సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని ఈ కమిటీ భావిస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ముజ్తబా నియామకానికి ఈ కమిటీలోని కొందరు సుముఖంగా లేరని, కానీ ఐఆర్‌జీసీ ఒత్తిడితోనే ఆయనకు పగ్గాలు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ముజ్తబా ఇప్పటివరకు ఇరాన్‌లో అధికారిక పదవులేవీ చేపట్టలేదు. బహిరంగ ప్రసంగాల్లోనూ అరుదుగా కన్పించేవారు. అయినా రాజకీయ నియామకాలు, పాలనాపరమైన నిర్ణయాల్లో తెర వెనుక కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముజ్తబా ఖమేనీపై 2019లో అమెరికా ఆంక్షలు విధించింది. అయినా ఆయన ప్రపంచవ్యాప్తంగా సంపన్న సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేయడమే గాక.. పశ్చిమ మార్కెట్లలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. ముజ్తబా నికర సంపద ఎంతనే దానిపై స్పష్టత లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆయనకు పెట్టుబడులు ఉన్నాయట. స్విస్ బ్యాంకు ఖాతాల్లో పెద్దఎత్తున డిపాజిట్లతో పాటు.. బ్రిటన్‌లో 138 మిలియన్ డాలర్ల విలువైన లగ్జరీ ప్రాపర్టీ ఆయన పేరు మీద ఉన్నట్లు సమాచారం. ఇరాన్ సంప్రదాయ వాద రాజకీయ నాయకుడు ఘోలమ్ అలీ కుమార్తె జహ్రాను ముజ్తబా 2004లో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరి కుటుంబం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. అయితే, ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా జరిపిన సంయుక్త దాడుల్లో ముజ్తబా భార్య మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం లేదు. ఈ దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మరణించినట్లు సమాచారం.

# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

న్యూఢిల్లీ,మార్చి4 ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ



విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు.

మోడీ పర్యటనలో యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతామని అన్నారు.

## ఆగివున్న కారును వేగంగా ఢీకొన్న కారు

**నుజ్జునుజ్జు అయిన కారు...ఐదుగురు దుర్మరణం**

**మృతులంతా బెంగళూరు వాసులుగా గుర్తింపు**

చిత్తూరు,మార్చి4 చిత్తూరు జిల్లాలోని పలమనేరు శివారులో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలమనేరు జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఓ కారు వెనుక వైపు నుంచి అత్యంత వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతులు బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళు _ఒడగా ఈ ప్రమాదం జరిగిందని చిత్తూరు జిల్లా పోలీసులు తెలిపారు.మృతులను మోహన్ దాస్ (71),నాగరాజారావు (61),కుసుమ (61),జయంతి (59),పూజ (33)గా గుర్తించారు.పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. పలమనేరు ప్రమాదంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు.

# ఐదోరోజూ పరస్పర దాడులు

టెహ్రాన్,మార్చి4 ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది.

మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ గత




శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

# ప్రేమానురాగాలకు ప్రతికహోళీ ఉత్సవములు



జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 4,(తరంగాలు): ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో దేశ వ్యాప్తంగా జరిగే హోళీ ఉత్సవాలు ధనిక–పేద తారతమ్యం లేకుండా ప్రేమానురాగాలకు ప్రతీకగా హోళీ పండుగను జరుపుకుంటారని పలువురు ఆర్యవైశ్యసంఘం నేతలు పేర్కొన్నారు.మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో బుధవారం హోళీ వేడుకలు ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోళీ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచికి జరిగిన విజయానికి గుర్తుగా,అదేవిధంగా వసంతోత్సవం ఆగమనానికి స్వాగతం పలికే హోళీనిచిన్నా,పెద్దలు సంబురంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో సంఘం నేతలు అంచూరి యుగందర్ దాంశెట్టి సోమేశ్వరం ఇమ్మడి అశోక్ ,గందె సోమన్న,బోనగిరి



శ్రవణ్ కుమార్ ,,బజ్జూరి సుధీర్ , హరిశంకర్ ,బజ్జూరి సంతోష్ రేవురీ శ్రీనివాస్, పట్నర్టీరి శ్రీధర్ ,వెంకన్న, బజ్జూరి రమేష్, అంచురి శీను, బజ్జూర్ సతీష్, పట్టురు వేణు,ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# రంగులు చల్లుకుంటూ ఆనందంగా హోలీ సంబరాలుపేరుపల్లి తాం

### మాజీ సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తుల ఉత్సాహం

కారేపల్లి తరంగాలు న్యూస్ మార్చి 4పేరుపల్లి గ్రామంలోని తాండాలో హోలీ పండుగను గ్రామస్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తాండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుపండుగ సందర్భంగా గ్రామంలోని యువకులు, మహిళలు, పెద్దలు పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందంగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా పండుగలను జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.



భవిష్యత్తులో కూడా ఇలాంటి పండుగలను ఐకమత్యంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# 99 రోజుల ప్రజా పాలన కార్యాచరణకు శ్రీకారం



భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మార్చి 4:జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్య శిబిరాలు, రోడ్డు భద్రత అవగాహన, సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత––డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం, రైతులకు సాగు సలహాలు, విద్యా వ్యవస్థ బలోపేతం, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారుగ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త నిర్వహణ, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను తనిఖీ చేయాలని ఆదేశించారుఅలాగే మహిళా సంఘాల రుణాల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, పన్నుల వసూళ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీవో సంజీవరావు, ఎస్సీ డీడీ శ్రీలత ,బీసీ డీడీ విజయలక్ష్మి ,ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల కోఆర్డినేటర్ రాంబాబు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు



జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 4,(తరంగాలు): సమాజంలోని అన్ని వృత్తుల వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని,వారు సమాజనిర్మాతలని ఆర్యవైశ్య అనుబంధ వాసవిక్లబ్ ,వనితా క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు అంచూరి సురేష్ ఇటీవల ఉద్యోగ విరమణ చేసాడు.ఈ సందర్భగా బుధవారం మండల కేంద్రంలో వాసవి క్లబ్ ,వనితా క్లబ్ మండలశాఖ ప్రతినిధులు సంయుక్తంగసురేష్ ను శాలువలు,బొకేలతో సన్మానించారు సురేష్ తాను చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా పనిచేయడం, పైగా తన సర్వీస్ మొత్తఒకే మండలంలో పూర్తిచేయడం అరుదైన అవకాశమన్నారఈ కార్యక్రమంలో వాసవి క్లబ్,వనితా క్లబ్ ల పీఎస్టీలు రేవూరి శ్రీనివాస్ ,బజ్జూరి సుధీర్ ,ఇమ్మడి అనీల్ ,దొడ్డ ఉమ,దాంశెట్టీ శ్రావ్య, అంచూరి కమల చిట్టిమళ్ళ కృష్ణమూర్తి, అంచూరి యుగందర్ ,దాంశెట్టి సోమన్న,ఇమ్మడి అశోక్ , బెలిదె హరిశంకర్ ,పాలకుర్తి రాజన్న, బజ్జూరి ధర్మయ్య, అంచూరి సుదర్శనం,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# హనుమంతులపాడు, సుదిమళ్ళ గ్రామాలలో ఘనంగా హోలీ వేడుకలు



ఇల్లందు ప్రతినిధి మార్చి4,( తరంగాలు): ఇల్లందు మండలం హనుమంతులపాడు, సుదిమళ్ళ గ్రామాలలో ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించారు. హోలీ వేడుకలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కల్తీ పద్మ తోటి స్నేహితులు,అలాగే గ్రామ మహిళలు, చిన్న పిల్లలతో కలిసి ఆడి పాడి రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హోలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హోలీ పర్వదినం ప్రజలందరి ఐక్యతకు చిహ్నమని. హోలీ సందర్భంగా అందరి జీవితాలు రంగుల మాయం కావాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు,చిన్నపిల్లలు పాల్గొన్నారు.

6

# గద్దర్ విగ్రహా ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్.

కల్వకుర్తి. మార్చి 4 తరంగాలు ప్రతినిధి

కల్వకుర్తి పట్టణంలో మార్చి 8న ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు .ఈ సందర్భంగా పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన వారు గద్దర్ అని కొనియాడారు. మార్చి 8న జరిగే గద్దర్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆవిష్కరణ కమిటీ చైర్మన్ శర్మ ,జేఏసీ చైర్మన్ సదానంద గౌడ్, బొజ్జన్న



గోపాల్, సంజీవ, రజిత, నర్సింలు ,పడకంటి వెంకటేష్,మహేశ్ పాల్గొన్నారు

### బి.ఆర్.ఎస్.నాయకుల సమక్షంలో

# మాజీ కౌన్సిలర్ బొజిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా



కల్వకుర్తి మార్చి 4 తరంగాలు ప్రతినిధి

కల్వకుర్తి పట్టణంలోని బి.ఆర్.ఎస్. మాజీ కౌన్సిలర్ అభ్యర్థి భోజిరెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ నాయకుల మధ్య ఘనంగా జరిగాయి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ శ్రీశైలంపాల్గొన్నారు.బిఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ భోజిరెడ్డిని వారి పొలంలో శాలువాతో పూలదండతో సన్మానించి కేక్ కటింగ్ చేయించడం జరిగింది. మాజీ కౌన్సిలర్ భోజరెడ్డికి ఉదయం నుంచే సోషల్ మీడియా ద్వారా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ శ్రీశైలం మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం పాటుపడే వ్యక్తి మాజీ వార్డ్ కౌన్సిలర్ భోజి రెడ్డి అని బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ యువతకు మార్గనిర్దేశం చేస్తున్న ఆయన ఏ వార్డులో పోటీ చేసిన ఆ వార్డులో ఎవరికి ఆపద వచ్చిన ఆదుకునే గొప్ప గుణం ఉన్న వ్యక్తి నలుగురికి ఆదర్శం భోజిరెడ్డి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏ పి ఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి. మాజీ చైర్మన్ శ్రీశైలం తో పాటు బొజిరెడ్డి స్నేహితులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# పట్టుదల,క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.



### విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.

### -- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.

కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మార్చి.04, తరంగాలు ;జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ ,బీసీ,మైనారిటీ,అన్ని విద్యాసంస్థలు,పాఠశాలలు,కళాశాలలు, వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్,న్యూట్రిషన్,సానిటేషన్ లపై క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో ప్రత్యేక అధికారులు సంబంధిత సిబ్బంది ముందుకు సాగాలని,పిల్లలకు అందించే సౌకర్యాలలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని (కేజీబీవీ) కస్తూరిబా గాంధీ విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ గది, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు.అనంతరం తరగతి గదులలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు,డైట్ మెనూ, తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని,పక్కాగా డైట్ మెనూ ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం స్నాక్స్ అందించాలని, తద్వారా పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు.ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు.ప్రతి విద్యార్థిని, గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు.ప్రత్యేక అధికారులు ఇప్పటికే వారికి కేటాయించిన విద్యా సంస్థలలో తనిఖీలు నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించడం జరుగుతుందని,ప్రతిరోజు ఉదయం సాయంత్రం వసతిగృహాలు,విద్యా సంస్థల నివేదికలు సమర్పించాలని సూచించారు.కేజీబీవీ పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్,స్పెషల్ అధికారినీ సోమలక్ష్మిని పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని,లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్,స్థానిక తహసిల్దార్ వివేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# ఆర్యభట్ట స్కూలు ఘటన పై విద్య అధికారుల విచారణ


తొర్రూర్ మార్చి 4 తరంగాలు

స్థానిక పట్టణ కేంద్రంలో ఉన్న ఆర్యభట్ట ప్రైవేట్ పాఠశాల, లో ఫిబ్రవరి 24 నా విద్యార్థిపై అత్యాయత్నం జరిగిన ఘటనలో భాగంగా, విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ కు గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేశారు. దాన్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బుధవారం, స్థానిక తహశీల్దార్ జి శ్రీనివాస్, ఆర్ ఐ నజీముద్దీన్ నెల్లికుదురు ఎంఈఓ, తొర్రూర్ ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఆధ్వర్యంలో ఘటనపై న్యాయ విచారణ చేపట్టారు. బాధిత



తల్లిదండ్రులను, విద్యార్థులను, పాఠశాల వార్డెన్ మురళి, నీ కరస్పాండెంట్ మధుకర్ రెడ్డిని విచారించారు. అనంతరం ఆర్యభట్ట స్కూల్ హాస్టల్, విద్యార్థి ఉన్న హాస్టల్ గదిని, క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఇరువైపులా వాంగ్మూలాలను రాతపూర్వకంగా, తీసుకొని పై అధికారులకు నివేదికను అందజేస్తామని, జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని పరిశీలించిన తర్వాత, ఈ ఘటనకు పాఠశాల యాజమాన్యం కారణమని తేలితే జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు






# ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్‌గా తిరుపతి




- రూ.321 కోట్లతో ఆధునికీకరణ పనులు
- దేశంలో భోపాల్ తర్వాత ఈ తరహా సదుపాయం
- రెండు ఎయిర్ కాంకోర్స్‌లు ఏర్పాటు

**తిరుపతి, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోని రైల్వే స్టేషన్‌ను ప్రపంచస్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నారు. వచ్చే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.321 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలో భోపాల్ తర్వాత ఈ తరహా సౌకర్యాలతో రూపొందిన రెండో రైల్వే స్టేషన్‌గా తిరుపతి నిలవనుంది. రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం రెండు ఎయిర్ కాంకోర్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లను అనుసంధానించే విధంగా నిర్మిస్తున్నారు. దీని వల్ల ప్రయాణికులు సులభంగా ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారమ్‌కు చేరుకునే అవకాశం కలుగుతుంది.ఈ ప్రాజెక్టులో భాగంగా స్టేషన్‌కు ఉత్తర, దక్షిణ భాగాల్లో ఆధునిక భవనాలు నిర్మిస్తున్నారు. వీటిలో ప్రయాణికుల కోసం విశాలమైన వేచిచోట్లతో పాటు ఆధునిక టికెటింగ్ సదుపాయాలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, పార్కింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. మార్చి నెలలో దక్షిణ భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్తర భవనం పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. ఇవి డిసెంబరు నాటికి పూర్తై ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. దీంతో తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునిక సదుపాయాలతో దేశంలో ప్రముఖ స్టేషన్లలో ఒకటిగా నిలవనుంది.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వాలి -మంద కృష్ణ మాదిగ

- కాంగ్రెస్‌పై ఎమ్మార్పీఎస్ నేత తీవ్ర విమర్శలు
- తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదని ఆవేదన
- రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణకు చెందిన మాదిగ సామాజిక వర్గ నేతకు కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా మాదిగలకు టికెట్లు ఇవ్వలేదని, దీంతో ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ నుంచి మాదిగల గొంతు వినిపించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఒక్క మాదిగ కూడా లేకపోవడం ఆ వర్గంపై పార్టీకి ఉన్న వివక్షకు నిదర్శనమని మంద కృష్ణ విమర్శించారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని, కానీ కీలక పదవుల్లో తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు.మాదిగలకు రాజకీయంగా తగిన గౌరవం కల్పించాలంటే వెంటనే రాజ్యసభ సీటు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలు దేశ స్థాయిలో వినిపించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# అధికారుల బదిలీలతో పాలన దెబ్బతింటోంది



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణలో అధికారుల తరచూ బదిలీల వల్ల పాలన దెబ్బతింటోందని సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు పాలన చేయడం రాకపోవడంతోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తరచూ బదిలీ చేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదుసార్లు భారీ స్థాయిలో అధికారుల మార్పులు జరిగాయని హరీశ్ రావు తెలిపారు. విభాగాధిపతులు సగటున ఎనిమిది నెలలు కూడా ఒకే పదవిలో కొనసాగడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ, సింగరేణి, జీహెచ్‌ఎంసీ, ఐ అండ్ పీఆర్, పాఠశాల విద్య, మున్సిపల్, పంచాయతీరాజ్ వంటి అనేక శాఖల్లో అధికారులు తరచూ మారడంతో పాలనలో గందరగోళం నెలకొంటోందని విమర్శించారు. ఇప్పటివరకు దాదాపు 140 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారని, 20 మంది కలెక్టర్లను మార్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఒక కలెక్టర్‌కు జిల్లాపై పూర్తి అవగాహన రావడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, అంతకంటే ముందే బదిలీ చేయడం వల్ల పరిపాలనలో ఫలితాలు రావడం లేదన్నారు. అధికారులకు నచ్చితే మంచి పోస్టింగ్‌లు, లేదంటే వెంటనే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. పదవీ విరమణ చేసిన అధికారులకు సేవా పొడగింపులు ఇవ్వడం కూడా పెరిగిపోయిందని ఆయన విమర్శించారు. గతంలో ఇదే విషయంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తమ సూచనలను విమర్శలుగా కాకుండా నిర్మాణాత్మక సలహాలుగా స్వీకరించాలని హరీశ్ రావు కోరారు.

# లోకల్ హాలీడే పేరుతో జాలిడేలో ఉపాధ్యాయులు

జిల్లా కలెక్టర్ మాట వినకుండా సెలవు మంజూరు
పేద విద్యార్థులకి నాణ్యమైన విద్య అందేనా..?
మండలంలో అందని ద్రాక్షగా ప్రభుత్వ విద్య
ఇష్టారాజ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరు




**పాలేరు ఆర్సీ, మార్చి 4 (తరంగాలు) :** దేవుడు వరమిచ్చినా ఎవరూ కరుణించని విధంగా మారింది కూసుమంచి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పని తీరు. పేద విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఉపాధ్యాయులు తీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా కొందరు ఉపాధ్యాయులు వారి వ్యక్తిగత అవసరాల కోసం ఇష్టానుసారంగా పాఠశాలలకి సెలవులను ప్రకటిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

## ఈసీఆర్ (ఎవ్రీ చైల్డ్ రీడ్) అట్టడుగున కూసుమంచి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎవ్రీ చైల్డ్ రీడ్(ఈసీఆర్) పేరుతో ప్రతి విద్యార్థికి తప్పకుండా చదవడం రావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో సీఎం రేవంత్ రెడ్డి నుండి ప్రశంసలను కూడా అందుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమం అమలులో కూసుమంచి మండలం జిల్లాలోనే అట్టడుగులో ఉండటం శోచనీయం. ఇటీవల జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎవ్రీ చైల్డ్ రీడ్ పై హెడ్ మాస్టర్ లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలకి లోకల్ హాలిడే ఇవ్వకూడదని తెలిపారు. అయినప్పటికీ పలువురు పాఠశాల హెడ్ మాస్టర్ లు ఆయన మాటను లెక్క చేయకుండా మూడు కి మించి లోకల్ హాలిడేలను ప్రకటించారు.

## మూడు కి మించి లోకల్ హాలిడేల ప్రకటన..?

ప్రతి విద్యాసంవత్సరంలో ఉండే మూడు లోకల్ హాలిడేలను జూలై నెలలో సీత్లా భవాని, సెప్టెంబర్ నెలలో గణేష్ నిమజ్జనం, ఫిబ్రవరిలో శివరాత్రి మరుసటి రోజున లోకల్ హాలిడే ప్రకటించి మూడు సెలవులను వినియోగించుకున్నారు. కానీ హోలీ పేరుతో కొన్ని పాఠశాలలు నాలుగో లోకల్ హాలిడే ను 'దొరికితేనే దొంగ' అన్న వ్యవహారంతో ప్రకటించినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం. వీటిల్లో కూసుమంచి కాంప్లెక్స్ పరిధిలోని లాల్ సింగ్ తండా, సంధ్య తండా, గైగోళ్ళపల్లి, ఉడుతలగూడెం, హట్యాతండా, తురకగూడెం, చౌటపల్లి, పూరియా తండా, ఎర్రగడ్డతండా, దుబ్బతండా, మల్లేపల్లి కాంప్లెక్స్ పరిధిలోని కోక్యాతండా, గన్యా తండా, గంగబండతండా, లింగరాంతండా, బూరేనిగుట్ట తండా, గట్టు సింగారం, తుమ్మల తండా, అజ్మీరా హిరామన్ తండా, జక్కేపల్లి ఎస్సీ కాలని, అదే విధంగా జీళ్ల చెరువు కాంప్లెక్స్ పరిధిలోని పోచారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకి ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్ లు బుధవారం లోకల్ హాలిడేను ప్రకటించగా నాయకన్ గూడెం కాంప్లెక్స్ పరిధిలోని ఏ ఒక్క పాఠశాల కూడా లోకల్ హాలిడే ఇవ్వలేదు. అయితే నాలుగో లోకల్ లోకల్ హాలిడే విషయం బట్టబయలు కాకుండా పలువురు పాఠశాల హెడ్ మాస్టర్ లు ఉపాధ్యాయల, విద్యార్థుల హాజరు పట్టికలను తారుమారు చేసే



యోచనలో ఉన్నట్లు సమాచారం.

## ఎక్కువ సెలవులు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం : ఎంఈఓ రాయల వీరస్వామి

పరిమితికి మించి లోకల్ హాలిడే వినియోగం పై మండల విద్యాధికారి రాయల వీరస్వామి ను మీడియా పరంగా చరవాణిలో వివరణ కోరగా లోకల్ హాలిడే లను మూడు కంటే ఎక్కువ తీసుకోవడానికి వీలు లేదని, ఎవరైనా పాఠశాలలకు ఎక్కువ సెలవులు ప్రకటిస్తే విచారణ చేపట్టి సంబంధిత ఉపాధ్యాయులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బాచుపల్లిలో అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఈటల రాజేందర్

**బాధితులను పరామర్శించిన ఎంపీ**
**కరెంటు తీగల వల్లే ప్రమాదమని అనుమానం**
**సహాయం అందిస్తామని హామీ**



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బాచుపల్లిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. బాధితులతో మాట్లాడి సంఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి నగర్, బాచుపల్లి రోడ్డులో పల్నాడు, నరసరావుపేట, గుంటూరు ప్రాంతాల నుంచి సుమారు 20 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం వచ్చిన కుటుంబాలు ఫర్నిచర్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. షాపుల వద్దే నివసిస్తూ జీవనం సాగిస్తున్న వారందరి సంపాదన ఒక్కసారిగా అగ్నికి ఆహుతైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లైన్ తెగిపడటం వల్లే అగ్ని ప్రమాదం సంభవించి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా కష్టపడి సంపాదించిన సర్వం కళ్లముందే కాలిపోవడం హృదయవిదారకమని పేర్కొన్నారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తమ వంతు సహాయం అందించి, వారు మళ్లీ వ్యాపారం ప్రారంభించేలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో అనేక చోట్ల కరెంటు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బిల్డింగ్ పై నిలబడితే చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉన్నాయని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అండర్ గ్రౌండ్



కేబుల్ వ్యవస్థ అమలు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# మెడికల్ విద్యార్థులకు ఫీజు చెక్కుల పంపిణీ





**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి సేవా కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 16 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా సంవత్సరం ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పేద కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడేలా విద్యను అభ్యసించాలని సూచించారు. రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజంలోని పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవా దృక్పథాన్ని ఆయన అభినందించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం తగ్గేలా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు తమ చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా మారి సమాజానికి సేవ చేస్తామని వారు పేర్కొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**
**బాచుపల్లి అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలన**
**వేసవిలో అగ్నిప్రమాదాల ప్రమాదం ఎక్కువ**
**ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన**





**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బాచుపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఫర్నిచర్ దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై అక్కడి దుకాణాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు దుకాణాలకు అంటుకోవడంతో మంటలు వ్యాపించినట్లు కొందరు తెలిపారు. మరికొందరు పైగా వెళ్తున్న విద్యుత్ తీగ తెగి మంటలు చెలరేగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన కమిషనర్ వేసవిలో అగ్నిప్రమాదాల ప్రమాదం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు ఎందుకు జరుగుతాయో అవగాహన పెంపొందించుకుని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బాచుపల్లి ఘటనలో 22కి పైగా ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఒక్కో దుకాణంలో సుమారు రూ.25 లక్షలకు పైగా విలువైన సామగ్రి ఉండటంతో వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. నష్టపరిహారం అంశాన్ని రెవెన్యూ శాఖ పరిశీలిస్తుందని వెల్లడించారు. తనిఖీలు మాత్రమే సరిపోవని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు అందరూ తప్పనిసరిగా పాటించినప్పుడే ఇలాంటి ప్రమాదాలు తగ్గుతాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని హైడ్రాకు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామని తెలిపారు.

# కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడి

**530 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం**
**తయారీ పరికరాలు, యంత్రాలు సీజ్**
**రూ.18 లక్షల విలువైన సామగ్రి పట్టివేత**



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కల్తీ నెయ్యి తయారీ కేంద్రాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. భోలానగర్‌లో నిర్వహించిన దాడిలో భారీగా కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో సుమారు 530 కిలోల కల్తీ నెయ్యి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అదనంగా నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న బాయిలర్లు, ప్యాకింగ్ యంత్రాలు మరియు ఇతర పరికరాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నెయ్యి మరియు పరికరాల మొత్తం విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కల్తీ నెయ్యిని మార్కెట్లో విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## మక్క కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

**కొనుగోలు కేంద్రాలు లేక రైతులకు నష్టం**
**మద్దతు ధర అందడం లేదని ఆరోపణ**
**మక్క రైతుల సమస్యలపై హరీశ్ రావు విమర్శలు**



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్రంలో మక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని ఆయన విమర్శించారు. యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం యాప్‌ల ద్వారా అందిస్తామని ప్రకటించి విఫలమైందని అన్నారు. పంట కోత దశకు వచ్చినప్పటికీ రైతులకు పంట పెట్టుబడి సాయం అందించలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఆరేపల్లి గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్న రైతులు ప్రతి ఏడాది నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.600 వరకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక్క ఆరేపల్లి సమస్య మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మక్క రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. అనేక జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమవడం, చెల్లింపులు ఆలస్యం కావడం, రవాణా సదుపాయాల లేమి వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అవసరమైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తూ మక్క పంటను కొనుగోలు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## నగర ప్రజలకు అందుబాటులోకి మరో రెండు చెరువులు



**హైదరాబాద్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** నగరంలోని చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మరో రెండు చెరువులు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. పాతబస్తీలోని బమ్రుకున్-ఉద్-దౌలా చెరువు, కూకట్‌పల్లిలోని నల్ల చెరువులను అభివృద్ధి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ నెల 6వ తేదీన బమ్రుకున్-ఉద్-దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం మరికొన్ని రోజుల్లో కూకట్‌పల్లి నల్ల చెరువును కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. హైడ్రా చేపట్టిన మొదటి దశలో మొత్తం ఆరు చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వాటిలో అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఇప్పటికే ప్రారంభించారు. మిగతా చెరువుల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రెండో దశలో నగరంలో మరో 14 చెరువులను అభివృద్ధి చేయాలని హైడ్రా ప్రణాళిక రూపొందిస్తోంది. చెరువుల పునరుద్ధరణ ద్వారా నగరంలోని పర్యావరణ పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాతబస్తీలోని చారిత్రాత్మక బమ్రుకున్-ఉద్-దౌలా చెరువును ఆక్రమణల నుంచి విముక్తి చేసి పూర్తిగా అభివృద్ధి చేశారు. చెరువు కట్టను బలపరిచి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట స్థలాలు, వృద్ధులు సేదతీరేందుకు విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఔషధ గుణాలున్న మొక్కలు, నీడనిచ్చే చెట్లను నాటారు. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి నల్ల చెరువును కూడా ఆక్రమణల నుంచి విముక్తి చేసి విస్తీర్ణాన్ని పెంచారు. మురుగు నీటి సమస్యలను పరిష్కరించి చెరువు పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, పార్కులు, వినోద సదుపాయాలు కల్పించడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి సేదతీరుతున్నారు. చెరువుల పునరుద్ధరణతో నగరంలో వరద సమస్యలు తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అధికారులు తెలిపారు.

## భారత్–శ్రీలంక సైనిక సహకారంపై చర్చలు

శ్రీలంకను సందర్శించిన భారత సైన్యాధికారి
రెండు దేశాల సైనిక నాయకుల భేటీ
ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ప్రాధాన్యం



**డెస్క్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** భారత సైన్యంలోని సప్తశక్తి కమాండ్ ఆర్మీ కమాండర్ మంజిందర్ సింగ్ శ్రీలంకను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీలంక సైన్యాధిపతి బీకేజీఎం లసంత రోడ్రిగోతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రెండు దేశాల సైనిక నాయకులు పరస్పర సహకారం, భద్రతా అంశాలు, శిక్షణ విధానాలు తదితర అంశాలపై చర్చించారు. సైనిక రంగంలో అనుభవాలు, వ్యూహాత్మక విషయాలపై కూడా పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య సైనిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. పరస్పర విశ్వాసం, నమ్మకం పెంపొందించేందుకు ఈ భేటీ ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. భారత్–శ్రీలంక మధ్య సైనిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు.

## రక్షణ రంగానికి భారీ ఊతం

- వాయుసేన కోసం 60 మధ్యతరహా రవాణా విమానాల కొనుగోలు
- స్వదేశీ ఘాతక్ యుద్ధ డ్రోన్‌కు అనుమతి
- సైన్యానికి 300 ధనుష్ హోవిట్జర్లు



**న్యూఢిల్లీ, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన ఆధునీకరణ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో వాయుసేన, భూసేనలకు ఆధునిక సాంకేతిక సామర్థ్యాలు పెరుగనున్నాయి. ఈ ప్రణాళికలో భాగంగా భారత వాయుసేనలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న పాత అంటోనోవ్ ఏఎన్–32 రవాణా విమానాలను దశలవారీగా మార్చేందుకు 60 మధ్యతరహా రవాణా విమానాలను కొనుగోలు చేయనున్నారు. ఇందులో 12 విమానాలను నేరుగా విదేశాల నుంచి సిద్ధంగా కొనుగోలు చేయగా, మిగిలిన 48 విమానాలను దేశంలోనే తయారు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా భారత రక్షణ పరిశోధన సంస్థ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేస్తున్న స్వదేశీ స్టెల్త్ యుద్ధ డ్రోన్ ఘాతక్ యుద్ధ డ్రోన్కు కూడా అనుమతి లభించింది. ఈ డ్రోన్‌ను శత్రు ప్రాంతాల్లో లోతైన దాడులు నిర్వహించేందుకు ఉపయోగించనున్నారు. భారత భూసేనకు కూడా ఈ ప్రణాళికలో భాగంగా 300 స్వదేశీ ధనుష్ హోవిట్జర్ తుపాకిలను అందించనున్నారు. ఇవి అధిక దూరం వరకు లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యం కలిగిన ఆధునిక తుపాకులు. అదనంగా స్వదేశీ కావేరి ఇంజిన్ ఆధారంగా అభివృద్ధి చేసిన ఇంజిన్‌ను భవిష్యత్తులో ఘాతక్ వంటి డ్రోన్లకు వినియోగించే అవకాశాలు ఉన్నాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆధునీకరణ ప్రణాళికతో వాయుసేన రవాణా సామర్థ్యం, ఖచ్చితమైన దాడి సామర్థ్యం, భూసేన తుపాకీ దళాల బలం గణనీయంగా పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## యుద్ధంలోకి మమ్మల్ని లాగవద్దు

- స్పెయిన్ ప్రధాని సాంచెజ్

- శాంతిని కోరుకున్నందుకు ఆంక్షలు సరికాదని వ్యాఖ్య
- ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో స్పందన
- యుద్ధం మానవాళికి విపత్తు అని హెచ్చరిక



**మాడ్రిడ్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ దౌత్య యుద్ధానికి దారితీస్తున్న నేపథ్యంలో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో యుద్ధంలోకి తమ దేశాన్ని లాగవద్దని, శాంతిని కోరుకుంటున్నందుకు తమపై ఆంక్షలు విధించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో సాంచెజ్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న దేశాల లక్ష్యాల్లో స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. స్పెయిన్ ఎన్నడూ ఇలాంటి రక్తపాతాన్ని కోరుకోదని సాంచెజ్ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు చేసిన తీర్మానాల తర్వాతే తాము శాంతి కోరుతున్నామని గుర్తుచేశారు. ఒక దేశం చేసే చట్టవిరుద్ధ చర్యలకు మరో దేశం అదే విధంగా ప్రతిస్పందించడం వల్ల ప్రపంచానికి భారీ విపత్తులు తప్పవని ఆయన హెచ్చరించారు. యుద్ధం కొనసాగితే మానవాళికి తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ఇరాన్ కొత్త సుప్రీం నేతను వదిలిపెట్టమని ఇజ్రాయెల్ హెచ్చరిక

సుప్రీం లీడర్‌పై దాడుల తర్వాత ఉద్రిక్తత
కొత్త నేతను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరిక
అమెరికా సహకారంతో చర్యలు కొనసాగుతాయని ప్రకటన



**టెల్ అవీవ్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఖమేనీ మరణించి నాలుగు రోజులు గడిచినా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ప్రాంతీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని, అమెరికాను బెదిరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని కాట్జ్ హెచ్చరించారు. ప్రపంచాన్ని బెదిరించే విధంగా పనిచేసే ఏ నాయకుడినైనా అంతం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్‌లో కొత్త సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా, వారు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టబోమని ఆయన తెలిపారు. అమెరికా భాగస్వామ్యంతో ఇరాన్ పాలన సామర్థ్యాలను పూర్తిగా నిర్వీర్యం చేసే చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఖమేనీ రెండో కుమారుడు ముజ్తబా ఖమేనీను ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నుకునే ప్రక్రియ జరుగుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్‌తో అతనికి బలమైన సంబంధాలు ఉన్నాయని, త్వరలో బాధ్యతలు చేపట్టే అవకాశముందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి

# మహిళా పైలట్లలో భారత్ ముందంజ

- ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలట్లు భారత్‌లో
- ప్రపంచ సగటుతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ
- వాయుసేన, పౌర విమానయానంలో మహిళల ప్రతిభ



**డెస్క్, మార్చి 4 (తరంగాలు ప్రతినిధి):** విమానయాన రంగంలో మహిళల పాత్ర రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా మహిళా పైలట్ల సంఖ్యలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో నిలుస్తోంది. భారతీయ విమానయాన సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం పైలట్లలో సుమారు 15 శాతం మంది మహిళలే ఉండటం విశేషం. ప్రపంచ సగటు కేవలం 5 శాతం మాత్రమే ఉండగా, భారత్‌లో అది మూడు రెట్లు ఎక్కువగా ఉండడం గర్వకారణంగా భావిస్తున్నారు. పౌర విమానయాన రంగంతో పాటు సైనిక రంగంలో కూడా మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. భారత వాయుసేనలో కూడా మహిళా పైలట్లు విజయవంతంగా సేవలందిస్తున్నారు. యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు వంటి విభాగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తూ ముందుకు సాగుతున్నారు. విమానయాన రంగంలో మహిళల పెరుగుతున్న భాగస్వామ్యం దేశానికి గర్వకారణంగా మారింది. భారత వాయుసేన మహిళలను పైలట్లుగా నియమించడం 1990 దశకంలో ప్రారంభమైంది. అప్పటి నుంచి మహిళలు హెలికాప్టర్లు, రవాణా విమానాలను నడిపే బాధ్యతలు చేపట్టారు. తరువాత కాలంలో యుద్ధవిమానాల విభాగంలో కూడా మహిళలకు అవకాశం కల్పించడం జరిగింది. దీంతో విమానయాన రంగంలో మహిళల అవకాశాలు మరింత విస్తరించాయి. విశేషం ఏమిటంటే మహిళలను పైలట్లుగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు లేకపోయినా,



భారతదేశంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఈ రంగంలో ముందుకు రావడం గమనార్హం. తమ ప్రతిభ, కృషితో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్న మహిళా పైలట్లు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు.

# హనుమంతులపాడు,సుదిమళ్ళ గ్రామాలలో ఘనంగా హోలీ వేడుకలు

**ఇల్లందు ప్రతినిధి మార్చి4,( తరంగాలు):** ఇల్లందు మండలం హనుమంతులపాడు, సుదిమళ్ళ గ్రామాలలో ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించారు. హోలీ వేడుకలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కల్తీ పద్మ తోటి స్నేహితులు,అలాగే గ్రామ మహిళలు, చిన్న పిల్లలతో కలిసి ఆడి పాడి రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హోలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హోలీ పర్వదినం ప్రజలందరి ఐక్యతకు చిహ్నమని. హోలీ సందర్భంగా అందరి జీవితాలు రంగుల మాయం కావాలని



ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు,చిన్నపిల్లలు పాల్గొన్నారు.

# తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**ఇల్లందు ప్రతినిధి మార్చి4,( తరంగాలు)** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగెల రామస్వామి. మార్చి 2 తేదీ నుండి ఇల్లందు తాసిల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష కార్యక్రమం మూడోరోజు లో భాగంగా మాట్లాడుతూ,ఇల్లందు మండలంలో జడ్జిమెంట్ వచ్చిన ఆదివాసులకు పరిష్కారం లేదని, అలాగే పోడు భూముల పట్టాలు ఉన్న ఆదివాసులు సాగు చేసుకునే పరిస్థితి లేదన్నారు.ఇల్లందు తాసిల్దార్ ఇల్లందు రేంజర్ జాయింట్ గా సర్వే నిర్వహించి జడ్జిమెంట్ వచ్చినవారికి వాళ్ల భూములు వాళ్లకి స్వాధీనం పరచాలని అన్నారు. ఇల్లందు తాసిల్దార్ ఏజెన్సీలో పని చేయలేరు కావున నాన్ ఏజెన్సీకి ట్రాన్సుర్ చెయ్యాలని




తెలిపారు. ఆదివాసి చట్టాలపై అవగాహన ఉన్న తాసిల్దార్ ని నియమించాలని కోరారు. ఈ దీక్షలో పాల్గొన్నవారు పూనెం అనసూయ, బిజ్జా నరసయ్య, కల్తి మల్లయ్య, చీమల నరసింహారావు, కుంజ కిరణ్ కుమార్.




# జడ సతీష్ మరణం
# బిజెపి పార్టీకి తీరని లోటు

**సతీష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వన్నాల వెంకట రమణ**

**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 04,తరంగాలు** : బిజెపి నాయకులు జడ సతీష్ మరణం బీజేపీ పార్టీకి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు. వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామానికి చెందిన జడ సతీష్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి ఉన్నల వెంకటరమణ నివాళులర్పించి కుటుంబ సభ్యుల పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి కట్రియాల గ్రామానికి చెందిన నాయకులు జడ సతీష్ ఇటీవల గుండెపోటుతో మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బీజేపీ పార్టీ గ్రామంలో ఎదుగుదలకు అహర్నిశలు పాటుపడిన నాయకుడి మరణం ఎంతో వేదనకి



గురిచేసిందని వారి మరణం తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రాయపురపు కుమారస్వామి, సీనియర్ నాయకులు మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి, చెంగల రాజు, సుల్తాన్ రాజు , చెంగల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు
# జన్మదిన వేడుకలు

**ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని బర్త్ డే కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**







**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 04,తరంగాలు** : వర్ధన్నపేట మండలం, ఇల్లందలోని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ ఏరియాలో వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ బర్త్ డే కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం హన్మకొండ వారి నివాసానికి వద్దకు వెళ్లి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శాలువాతో ఘనంగా సన్మానించి బొకే అందచేసి,ఎమ్మెల్యే కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల ఉప అధ్యక్షుడు కుల్ల యాకంతం, మండల సీనియర్ నాయకులు మరుపట్ల సాయికుమార్,సంకినేని గంగా రాజు(ఉప సర్పంచ్ ల్యాబర్తి)లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపిన
# వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ మోహన్ గౌడ్, నేతలు

**హనుమకొండ ప్రతినిధి,మార్చి 4, తరంగాలు** : వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని, బుధవారం నేతలతో కలిసి వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండలం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు శంకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మధు, నాయకులు,



కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జననేతకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

## ఘనంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జన్మదిన వేడుకలు





**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 04,తరంగాలు :** సంకల్పమే బలం, జనహితమే ధ్యేయంగా.. జన సంక్షేమం కోసం తపిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంతి ఐపిఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు రాజకీయ ప్రముఖులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రత్యక్షంగా, చరవాణి ల ద్వారా, సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, ప్రముఖులతో బుధవారం ఉదయం నుంచే హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.








## భద్రకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ ప్రతినిధి, మార్చి 04,తరంగాలు :** వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రకాళి దేవాలయాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తమ జన్మదినం సందర్భంగా దర్శించుకున్నారు.తొలుత ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఘన స్వాగతం పలికారు.అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో ఘనంగా ఆశీర్వాదం అందిచారు.తదనంతరం సాయిబాబా ఆలయం ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అదే విధంగా నాయకులు కార్యకర్తలు భద్రకాళి ఆలయ ముందు కేక్ కట్ చేయించి పండ్లు ఎమ్మెల్యే చేత పంపిణీ చేయంచారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, శ్రేయస్సు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.తమ జన్మదినాన్ని సాదాసీదాగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకుంటూ ప్రజాసేవలో మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.అనంతరం ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యే నాగరాజు కు శుభాకాంక్షలు తెలియజేశారు.















